

# భారతీయ సినిమాల్లో స్త్రీమూర్తులు

## వారాల ఆనంద్



ఈ రోజుల్లో ఐతే చాలా సినిమాల్లో స్త్రీ పాత్రలు కేవలం ఆటబొమ్మలుగా ఉంటున్నాయి కానీ దశాబ్దాలుగా వచ్చిన ఇండియన్ సినిమాని పరిశీలిస్తే స్త్రీ పాత్రలకి పెద్దపీట వేసిన సినిమాలు ఎన్నో ఉన్నాయి. అన్ని భారతీయ భాషలనుంచీ స్త్రీ పాత్రలని ప్రధానంగా చిత్రీకరించిన ఉత్తమ సినిమాల పరిచయాలు .. నెలకి రెండు సినిమాల చొప్పున.

కళాత్మక చిత్రాభిమాని ఆనంద్‌గారు కవి, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాత, దర్శకులు కూడ. ఒక కవితా సంపుటిని, సినిమాల మీద నాలుగు పుస్తకాలని రచించారు. కళాత్మక చిత్రోత్సవాల నిర్వహణలో విశేషానుభవం ఉంది. **varalaanand@hotmail.com**

## కమల

భాష: హిందీ, కథ - విజయటెండుల్కర్, దర్శకత్వం:జగ్ మోహన్ ముంద్రా;

నటీనటులు - మార్క్ జూబర్, దీప్తినావల్, షబనా ఆజ్మి

విడుదల: 1984




స్త్రీని మనసున్న, వ్యక్తిత్వమున్న మనిషిగా కాకుండా వినియోగ వస్తువు స్థాయికి దిగజార్చిన మన సమాజంలోని కొన్ని ప్రాంతాల్లో స్త్రీల అమ్మకాలూ, కొనుగోళ్ళూ కూడా జరిగే స్థితి నెలకొని ఉంది. మారుమూల పల్లెల్నుంచీ ఓ మాదిరి పట్నాల్నించి స్త్రీలను కొనుగోలు చేసి మెట్రో పాలిటన్ మహానగరాల్లో వారిని అమ్మివేయడం లాంటి వ్యాపారం నిర్వహించే రాకెట్లు అనేకసార్లు వెలుగు చూశాయి. అధికారులు, రాజకీయ నాయకులు, బడా పారిశ్రామిక వేత్తల అండదండలతో ఆ విపణి కొనసాగుతూనే ఉంది. అలాంటి ఓ అమ్మకం రాకెట్‌ను బట్టబయలు చేసేందుకు ఓ జర్నలిస్టు చేసిన ప్రయత్నాన్ని మూల కథాంశంగా చేసుకుని 1984 లో 'కమల' చిత్రం వచ్చింది. జగ్‌మోహన్ ముంద్రా నిర్మించిన ఈ చిత్రం విజయ్ టెండూల్కర్ రాసిన మరాఠీ నాటకాన్ని ఆధారం చేసుకుని నిర్మితమయింది.

అలా వాస్తవ సంఘటనని ఆధారం చేసుకుని స్త్రీల సమస్యను మన సామాజిక స్థాయిని చిత్రం చర్చించే యత్నం చేసింది. అంతేకాదు ఒక విషయాన్ని వెలుగులోకి తేవడానికి, సెన్సేషనల్‌గా మలచడానికి మన పత్రికారంగం ఎట్లా కృషి చేస్తుందో కూడా 'కమల' చిత్రం తెలియజేస్తుంది. ఇంకా ప్రధానంగా ఒక విషయాన్ని వార్తగా చూపించి పేరు ప్రఖ్యాతలు గడించిన తర్వాత ఆ విషయం మూలాల్లోకి వెళ్ళకుండా ఉదాసీనంగా ప్రవర్తించే మన పత్రికా ప్రపంచపు తీరుతెన్నుల్ని కూడా ఈ చిత్రం నిగ్గు తేలుస్తుంది.

మొత్తం మీద స్త్రీల శరీర వ్యాపారాన్ని, దాని చుట్టూరా ఉండే అనేక సమస్యల్ని చర్చించ పూనుకున్న ఈ చిత్రంలో నటీనటుల నటనే ఆయువు పట్టులా సాగుతుంది. చిత్రం ముగింపు విషయంలో దర్శకుడు అయోమయంలో పడిపోవడంతో సినిమా సీదా సాదా చిత్రంలాగానే ముగిసిపోవడం సినిమా చివర్లో నిరాశ కలిగిస్తుంది. వ్యాపార పరంగా సైతం 'కమల' వైఫల్యమే చెందింది. కాని అది స్త్రీ సమస్యను చర్చించిన సినిమాగా నిలిచిపోతుంది.

చిత్ర కథాంశం విషయానికి వస్తే జైసింగ్ జాదవ్ అనే ప్రముఖ జర్నలిస్టు ఢిల్లీకి చెందిన ఒక పత్రికలో పనిచేస్తూ ఉంటాడు. మధ్యప్రదేశ్‌లో ఆదివాసీ స్త్రీలను అమ్మే రాకెట్ కొనసాగుతుందని తెలుసుకుని తాను వెళ్ళి పరిశోధనాత్మకంగా కమలను డబ్బిచ్చి కొంటాడు. ఆ విషయాన్ని పత్రికలో రాయడంతో అతనికి గొప్ప పేరొస్తుంది. దేశవ్యాప్తంగా ఆ వార్త, దాన్ని రాసిన జర్నలిస్టు, ఆయన పరిశోధన పెద్ద చర్చనీయాంశమైపోతుంది. కమల యొక్క పర్పజ్ ముగిసి పోయిందన్నట్టుగా ప్రవర్తిస్తున్న భర్తను ఏ విధంగానూ అర్థం చేసుకోలేక పోతుంది. అతన్ని కాకుండా సరితతో కూడా అవసరం మేరకే ప్రవర్తిస్తూ ఉంటాడు. తను తన కెరీర్ లాంటి అంశాల్నే తప్ప మానవీయ సంబంధాల పట్ల ఎలాంటి ఆచరణ లేనివాడు జాదవ్, తన అనుభవంతో పాటు సరిత పట్ల జాదవ్ ప్రవర్తనను పరిశీలించిన కమల తన గ్రామీణ అమాయకత్వంతో కూడిన సూటిదనంతో సరితను అడిగేస్తుంది. "బాబుగారు మిమ్మల్ని ఎంతకు కొనుక్కొచ్చారమ్మా?" అని. అంతే సరిత కళ్ళు తెరుచుకుంటాయి. తను ఇన్నాళ్ళూ భరిస్తూ వచ్చిన అనుభవానికి ఉన్న ముసుగును ఆ ప్రశ్న తొలిగించినట్టుగా ఫీలవుతుంది. తనకూ భర్తకూ నడుమ ఉన్న కేవలం భార్యాభర్తల బంధాన్ని ఆమె సమీక్షించుకుంటుంది. అంతదాకా తనకు తోచని విషయం బయట పడ్డట్టవుతుంది. కమల తన ఇంట్లోకి వచ్చేదాకా భార్యాభర్తల సంబంధం ఇట్లాగే ఉంటుందేమో అందరూ తన భర్తలాగే ఉంటారేమో అనుకుని సీదాసాదా మధ్య జీవనం సాగించలేనని నిర్ణయించుకుని భర్తతో వేరుపడుతుంది. తర్వాత కొంతకాలానికి ఉద్యోగంలోంచి తొలిగించబడి తాగుడుగు అలవాటు పడి పార్కులో దయనీయంగాపడి ఉన్న భర్తని సరిత దగ్గరకి తీసుకుని తిరిగి తమ ఇంటికి తీసుకెళుతుంది. దాంతో చిత్రం ముగిస్తుంది.

జర్నలిస్టు జాదవ్ పాత్రలో ఆనాటి విలక్షణ నటుడు మాక్ జాబర్, కమలగా దీప్తినావల్, సరితగా షబనా ఆజ్మీ ఎంతో పరిపక్వమయిన నటనని ప్రదర్శించి సినిమాకి ప్రాణం పోశారు.

## ఇజాజత్

**భాష:** హిందీ, **కథ** – సుబోధ్ ఘోష్; సినిమాటోగ్రఫీ – అశోక్ మెహతా; సంగీతం – ఆర్డీబర్మన్; **దర్శకత్వం** – గుల్జార్, **నటీనటులు** – రేఖ, నసీరొద్దీన్ షా, అహ్మద్, అనూరాధ పటేల్, షమ్మీకపూర్

**విడుదల:** 1987




**కవిగానూ, చలన చిత్రకారుడిగానూ,** భారతీయ సినిమా రంగంలో తనదైన స్థానాన్ని పొందిన గుల్జార్ నిర్మించిన ‘ఇజాజత్‘ కుటుంబానికి లోపలా, బయటా ఉన్న స్త్రీ పురుష సంబంధాల్ని, అనుబంధాల్ని మనముందు చర్చకు పెడుతుంది. ముఖ్యంగా ఒక పురుషుడికి తన జీవితకాలంలో ఇద్దరు స్త్రీలతో ఏర్పడిన అనుబంధం, ప్రేమా, వాటి పర్యవసానాలూ ఈ చిత్రంలో చర్చకు వస్తాయి. మానవ సంబంధాల్ని అందులో స్త్రీ, పురుష సంబంధాల్ని కవితాత్మకంగా ఆవిష్కరించే గుల్జార్ ‘ఇజాజత్‘లో మరింత పరిక్వతను ప్రదర్శిస్తాడు. అంతవరకూ ఆయన నిర్మించిన సినిమాల్లో అధికంగా సంభాషణలకు ప్రాధాన్యత ఉండి అవి మాటల మూటల్లా ఉండేవి. కాని ఇజాజత్‌కి వచ్చే సరికి గుల్జార్ తన చిత్రాన్ని దృశ్యమాలిక చేసే ప్రయత్నంలో పడ్డాడు. ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్‌ని ఉపయోగిస్తూ కేవలం ఒక రైల్వే స్టేషన్ అందులోని వెయిటింగు రూముని నేపథ్యంగా తీసుకుని చిత్రంగా నడిపిస్తాడు. ఇందులో సంగీతం, పాటలు ఎంత భావుకతను పంచుతాయో నిశ్శబ్దం అంతకు మించిన భావాల్ని వెదజల్లుతుంది. తుఫాను రాత్రి మొత్తం సినిమాకు గొప్ప గాంభీర్యాన్ని తెచ్చిపెడుతుంది. రైల్వే స్టేషన్‌లో వచ్చిపోయే రైళ్ళ ధ్వని, అవి వెదజల్లే కాంతి కెరటాలు, అవి ప్లాట్ ఫామ్‌పై కలిగించే చీకటి వెలుతురులు, వాటిని చిత్రబద్ధం చేయడంలో దర్శకుడి ప్రతిభ గొప్పగా ఉంటుంది. సినిమాలో ప్రదర్శించిన చీకటి వెలుగులు మానవ జీవితానికి ప్రతిబింబంలా కనిపిస్తాయి. దృశ్యాల మధ్య సాధించిన లయ కవితాత్మకతను కొనసాగిస్తుంది. ‘ఇజాజత్‘ చిత్రానికి మౌలిక కథాంశం సుబోధ్ ఘోష్ బెంగాలీలో రాసిన చిన్న కథ ‘జాతుగృహ‘ ఆధారంగా రూపొందింది. దర్శకుడు సినిమాలో మూల కథకు మొత్తంగా నిబద్ధుడై ఉంటాడు. కేవలం రైల్వే స్టేషన్, తుపాను రాత్రి, కొంత ఫ్లాష్ బ్యాక్ టెక్నిక్‌ని మాత్రం మూలం నుంచి స్వీకరించి, మిగతా విషయంలో తనదైన కొత్త అంశాలతో సినిమాని మలిచాడు.

కథాంశానికి వస్తే సుదూరంగా పర్వత స్థాణువుల్లో ఉన్న ఒక రైల్వే స్టేషన్ బయట భీకరమయిన తుఫాను, వర్షం. సుధ ఫస్ట్‌క్లాస్ వెయిటింగ్ రూములో కూర్చుని ఉంటుంది. ఆమె అక్కడికి మరో లింకు రైలును అందుకోవడానికి వస్తుంది. కాని తుపాను వరదల కారణంగా ఆమె ఎక్కాల్సిన రైలు రద్దవుతుంది. మళ్ళీ ట్రైను తెల్లారితే కాని లేదు. అందుకే ఆ రాత్రి ఆమె ఒంటరిగా ఆ వెయిటింగ్ రూములో ఉండిపోతుంది. ఇంతలో మరో రైలు వచ్చి ఆగుతుంది. అందులోంచి మరో ఒంటరి ప్రయాణికుడు దిగుతాడు. అతను కూడా తెల్లారి వచ్చే రైలులో ప్రయాణించాల్సి రావడంతో తనూ వెయిటింగ్ రూముకు వస్తాడు. అనుకోని రీతిలో, తప్పని పరిస్థితిలో ఆ ఇద్దరూ వెయిటింగ్ రూములో ఆ రాత్రి గడపాల్సి వస్తుంది. అతను మహేంద్ర. ఆ ఇద్దరూ ఒకరినొకరు గుర్తిస్తారు. ఆరేళ్ళ క్రితం విడిపోయిన ఆ ఇద్దరు భార్యాభర్తలు. ఇలా కలుసుకోవడంతో ఆశ్చర్యపోతారు. ఒకప్పుడు భార్యాభర్తలయిన వారిద్దరూ ఇప్పుడు అపరిచితులు. అలాగని అపరిచితులూ కారు. ఇద్దరూ గతస్మృతుల్లోకి వెళతారు. మహేంద్రకి పెళ్ళికి ముందే మాయతో స్నేహం ఉంటుంది. అందమయిన మోడల్ అయిన మాయ మహేంద్రలిద్దరూ ప్రేమించుకుంటారు. కాని ఇంట్లో వారి బలవంతం మేరకు అనుకోని రీతిలో మహేంద్రకు సుధతో పెళ్ళవుతుంది. అతను పెళ్ళయిన తర్వాత భార్యను ప్రేమిస్తాడు. ఆమెతో సహజీవనాన్ని మామూలుగానే గడుపుతాడు. కాని మాయను మోసం చేసానని తప్పు చేశాననే ఒక గిల్టీనెస్ మహేంద్రను పీడిస్తూనే ఉంటుంది.

కాని మాయ ఆ మాత్రం విషయాన్ని స్పోర్టివ్‌గా తీసుకుంటుంది. మహేంద్రకు మరో స్త్రీతో పెళ్ళికావడాన్ని తప్పుపట్టదు. ద్వేషం పెంచుకోదు. ఎప్పటిలాగే మామూలుగా ఉండటానికి ఇష్టపడుతుంది. అతనితో స్నేహంగా ఉండేందుకు యత్నిస్తుంది. కాని మాయ



మహేంద్రల స్నేహాన్ని సుధ అంగీకరించదు. మహేంద్రతో గొడవ పడుతుంది. ఇద్దరి మధ్యా పెరిగిన దూరం అగాధంలా మారి విషయం విడాకులదాకా వెళుతుంది. ఇద్దరూ విడిపోతారు. ఇంతలో మాయ ఒక యాక్సిడెంట్‌లో తీవ్రంగా గాయపడి ప్రాణాలు కోల్పోతుంది. ఈ కథంతా ఫ్లాష్‌బ్యాక్ లో తెరలు తెరలుగా దర్శకుడు వివరిస్తాడు. చిత్రం చివరికి వచ్చేసరికి అనుకోకుండా సుధ భర్త వెయిటింగ్ రూములోకి వస్తాడు. సుధ మళ్ళీ పెళ్ళి చేసుకుందన్న విషయం తెలుసుకుని మహేంద్ర షాక్ అవుతాడు. అప్పటికి తెలతెలవార్తూ ఉండగా తనను ప్రేమించే తనకు మరింత రక్షణగా ఉండే భర్తతో సుధ ప్లాట్ ఫారం వైపు కదిలి .వెళ్ళిపోతుంది. స్త్రీ పురుష సంబంధాల్ని అత్యంత సున్నితంగా తడిమిన సాధించింది. కుటుంబమూ, అందులో భాగస్వాములయిన భార్యాభర్తల మనస్తత్వాలూ, రక్షిత పరమయిన భావాలూ, ఇలా అనేక అంశాల్ని చిత్రం సునిశితమయిన స్థాయిలో చర్చకు పెడుతుంది.

❋❋❋

**Click here to share your comments on this article.**